# బిందువుగా ప్రారంభమై సింధువుగా మారిన బీఆర్ఎస్

## - భారతదేశ రాజకీయాల్లో సరికొత్త చరిత్రను లిఖించిన రాజకీయ పార్టీ

## కేసీఆర్ నేతృత్వంలో ఉద్యమపార్టీగా భూకంపం సృష్టించింది.. మూడుకోట్ల ప్రజానీకాన్ని ఒక్కతాటిపైకి తీసుకొచ్చింది..

## నేడు గులాబీ పార్టీ 25 ఏళ్ల పండుగ వేళ.. ఆపార్టీ దళపతి ఉత్తేజపూరిత ప్రసంగం కోసం తెలంగాణ ప్రజానీకం ఎదురుచూస్తోంది




**ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, పునర్నిర్మాణం ధ్యేయంగా 25ఏళ్ల క్రితం ఏర్పాటైన టీఆర్ఎస్ (బీఆర్ఎస్) ప్రస్థానంలో.. ఎన్నో అటుపోట్లు, తిరుగులేని విజయాలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర సమితి పేరుతో పురుడుపోసుకుని భారత రాష్ట్ర సమితిగా రూపాంతరం చెందిన బీఆర్ఎస్ 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలోకి అడుగు పెట్టనుంది. వరంగల్ వేదికగా జరిగే చరిత్రాత్మక రజతోత్సవ సభలో.. గులాబీ దళపతి కేసీఆర్ చేసే మహాగర్జన కోసం.. యావత్ తెలంగాణ సమాజంతోబాటు దేశమంతా ఉత్కంఠగా ఎదురుచూస్తోంది.ఈనేపథ్యంలో సిరి న్యూస్ ప్రత్యేక కథనం..**

### స్వయం పాలనే లక్ష్యంగా ఆవిర్భవించిన పార్టీ..

ఒక రాష్ట్ర చరిత్రలో 25 ఏండ్లు అంటే తక్కువేం కాదు. తెలంగాణ సాధన కోసం ఆవిర్భవించిన పార్టీగా, ఉద్యమ పంథాలో కొనసాగి, రాష్ట్రం ఆవిర్భావం తర్వాత పదేండ్లు అధికారంలో కూడా ఉండటం బీఆర్ఎస్ ప్రత్యేకత.2001, ఏప్రిల్ 27న తెలంగాణ అస్తిత్వ పతాకగా పురుడుపోసుకున్న పార్టీ.. నేడు ఇరవై నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకొని 25వ సంవత్సరంలోకి ప్రవేశించనున్నది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ 14 ఏండ్లు అవిరామంగా పోరాటం చేసి, అనేక ఉద్యమాలు చేసి తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిన పార్టీగా బీఆర్ఎస్‌కు రాష్ట్రంలో గుర్తింపు ఉంది. ఆనాటి జలదృశ్యం నుంచి నేటి జన దృశ్యం వరకు.. అస్తిత్వ పోరాటం నుంచి.. అధికార పీఠం వరకు.. అధికార పీఠం నుంచి..ప్రజా హృదయ సింహాసనం వరకు దాకా..కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ పార్టీ చరిత్ర గతినే మార్చివేసింది. త్యాగాల పునాదుల మీద బీఆర్ఎస్ ఆవిర్భవించిందితెలంగాణ రాష్ట్ర సమితి.. భారతదేశ రాజకీయాల్లో సరికొత్త చరిత్రను లిఖించిన రాజకీయ పార్టీ. ఓ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని, దోపిడీని ప్రశ్నిస్తూ స్వయంపాలనే లక్ష్యంగా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ముందుండి నడిపించి విజయ తీరాలకు చేర్చింది. అంతకు ముందున్న అనుభవాలను దృష్టిలో ఉంచుకొని.. రాజకీయ ప్రక్రియ ద్వారానే ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు సాధ్యమని బలంగా నమ్మి ముందుకెళ్లి గమ్యాన్ని ముద్దాడిన నాయకుడు టీఆర్ఎస్ అధినేత, గులాబీ దళపతి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు.తెలంగాణ సాధనే ధ్యేయంగా..కేసీఆర్ ఎత్తిన ఆ గులాబీ జెండా..25 ఏళ్లుగా తెలంగాణ ప్రజలకు అండాదండగా.. జయకేతనమై బీఆర్ఎస్ రెపరెపలాడుతోంది.ఉద్యమ పార్టీ నుంచి పక్కా పొలిటికల్ ఫక్తు రాజకీయపార్టీగా మారి.. తెలంగాణను అభివృద్ధికి చిరునామాగా మార్చింది.. ఇంకా చెప్పాలంటే.. తెలంగాణ ప్రజల ఇంటి పార్టీగా.. చెక్కుచెదరని అభిమానాన్ని సాధించి.. బీఆర్ఎస్ చిరకీర్తిని సొంతం చేసుకుంది.

### ముక్కోటి ఆశల ప్రతిరూపంగా కేసీఆర్ వచ్చాడు...

తెలంగాణ ప్రజలు తమను తాము పరిపాలించుకోవాలనే ఆకాంక్షకు రాజకీయ వ్యక్తీకరణగా తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించింది. వలస వాదం సుడిగాలిలో తెలంగాణ అస్తిత్వ స్పృహను కాపాడుకుంటూ.. విజయ పతాకం ఎగురవేసింది టీఆర్ఎస్! 1969 ఉద్యమం అణగారి పోయిన తరువాత.. ఎప్పటికైనా తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించగల మరో నాయకుడు వస్తాడా? అన్న ముక్కోటి ఆశల ప్రతిరూపంగా.. కేసీఆర్ వచ్చాడు. తెలంగాణ ఉద్యమంలో ఎందరో త్యాగధనులున్నారు. కానీ ఉద్యమమే కేసీఆర్‌ను ఎంచుకుంది. రెండు దశాబ్దాలుగా తెలంగాణను ఊగించి, ఉరికించి, దీవించి, శాసించి.. విజయతీరాలకు చేర్చిన నాయకుడు కేసిఆర్! అవును.. కేసిఆర్ ఉన్నత వ్యక్తిత్వం ముందు, ఆయన ఉక్కు సంకల్పం ముందు విధి సైతం తలవంచింది. ఆయన వ్యూహ చతురత వల్ల.. సిద్ధాంతాలకు, పార్టీలకు అతీతంగా నాయకగణం తెలంగాణకు జై కొట్టింది. కేసీఆర్ అచంచల దీక్ష, సిద్ధాంత బలం, వాగ్ధాటికి ముగ్ధులై..జాతీయ స్థాయిలో అనేక పార్టీలు తెలంగాణకు మద్దతు పలికాయి. ఫలితంగా తెలంగాణా ఆవిర్భవించింది..వెనుకబడిన తెలంగాణ వేదనలోంచి గులాబీ జెండా ఎగసింది. కేసీఆర్ నేతృత్వంలో ముందుకు ఉరికింది. సుశిక్షితులైన కార్యకర్తలే పునాదిగా పురోగమించింది. ధనబలం ఉన్న పార్టీలను జనబలంతో ఢీకొట్టింది. ఉద్యమ పార్టీగా భూకంపం పుట్టించింది.నాటి నుంచి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ముందుకు సాగింది టీఆర్ఎస్. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని కేంద్ర, రాష్ట్రాల్లో అధికారాన్ని పంచుకొన్నాక.. కొన్నాళ్ల తర్వాత బయటకు వచ్చింది. ఆ తర్వాత టీఆర్ఎస్ రాజకీయం పలు మలుపులు తిరుగుతూ వచ్చింది. కేసీఆర్‌తోపాటు పార్టీ తరఫున ఎన్నికైన ప్రజాప్రతినిధులు పదవులను లెక్కచేయక రాజీనామాలు చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. 2009లో చంద్రబాబుతో మహాకూటమి ఏర్పాటు చేశారు. ఆ ఎన్నికల్లో స్పష్టమైన తీర్పు రాలేదు. నాడు పార్టీ మనుగడే ప్రశ్నార్థమైన సందర్భంలో ఫ్రీజోన్ అంశాన్ని అనుకూలంగా మలుచుకొని సిద్ధపేట సభ ద్వారా ఉద్యోగ సంఘాలను ఒక్కతాటిపైకి తీసుకొచ్చారు. తద్వారా 2009 నవంబర్ 29న కేసీఆర్ సచ్చుడో..తెలంగాణ వచ్చుడో.. నినాదం తో అమరణ నిరాహారదీక్ష, శ్రీకాంతాచారి ఆత్మాహుతితో డిసెంబర్ 9న సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా ఆనాటి హెూం శాఖ మంత్రి చిదంబరం రాత్రి 11గం.లకు తెలంగాణ రాష్ట్ర ప్రాసెస్ ను ప్రారంభిస్తున్నామని స్వయంగా ప్రకటించారు.మరుసటిరోజే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయొద్దంటూ ఏపీకి చెందిన అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు రాజీనామాలు చేయడంతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నిర్ణయాన్ని నాటి కేంద్ర ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అన్ని వర్గాల, అన్ని ప్రజా సంఘాల, అన్ని పార్టీల ఆధ్వర్యంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం మహోగ్ర రూపం దాల్చి దాదాపు నాలుగేళ్లపాటు సాగింది. ఇక తెలంగాణ ఇవ్వకతప్పదు అని నిర్ణయించుకున్న కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఆతర్వాత కేంద్ర కేబినెట్ ఆమోదం, రాజ్యసభ, లోక్సభలలో ఆమోదం తర్వాత 2014 జూన్ రెండో తేదీన తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావమైంది.

### 2014లో ఒంటరిగా పోటీచేసిన బీఆర్ఎస్..

తెలంగాణ ఆవిర్భావంత తర్వాత 2014 సాధారణ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసిన తెలంగాణ రాష్ట్ర సమితి.. ఘనవిజయాన్ని సాధించి రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టింది. ఉద్యమాన్ని ముందుండి నడిపిన కేసీఆర్.. కొత్త రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా నవతెలంగాణకు భవితకు బాటలు వేసే బాధ్యతను భుజానికెత్తుకున్నారు. బంగారు తెలంగాణ లక్ష్య సాధన దిశగా ముందుకు సాగుతామని ప్రకటించారు. 2014 మొదలు ఏ ఎన్నిక వచ్చినా టీఆర్ఎస్ ఘనవిజయం సాధిస్తూ వచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు జరిగిన ఎన్నికల్లో ఏకంగా 99 స్థానాలను సాధించి రికార్డు సృష్టించింది. ఇదే సమయంలో తమది ఫక్తు రాజకీయ పార్టీగా మారిందని ప్రకటించిన గులాబీ నాయకత్వం.. కాంగ్రెస్, టీడీపీ సహా ఇతర పార్టీల నాయకులను ఆకర్షించింది.

పదవీకాలం మరో తొమ్మిది నెలలు ఉండగానే శాసనసభను రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు వెళ్లిన టీఆర్ఎస్.. 2018 ఎన్నికల్లో తిరుగులేని విజయంతో సత్తా చాటింది. దీంతో కేసీఆర్ రెండోమారు ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షునిగా కేసీఆర్ తనయుడు కేటీఆర్ బాధ్యతలు చేపట్టడంతో గులాబీ పార్టీలో కొత్త వాతావరణం ఏర్పడింది. ఫెడరల్ ఫ్రంట్ పేరిట జాతీయ రాజకీయాల వైపు కేసీఆర్ మధ్యలో దృష్టి సారించారు.కానీ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయంతో అది సాధ్యం కాలేదు. అటు రాష్ట్రంలోనూ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు టీఆర్ఎస్‌కు అంత అనుకూలంగా రాలేదు. స్వపరిపాలనలో ఎన్నో పథకాలు, కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ సర్కార్.. పలు అంశాల్లో తనదైన ముద్ర వేసింది. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతుబీమా, హరితహారం, రెండు పడకల గదుల ఇండ్లు, కులవృత్తులకు తోడ్పాటు, వివిధ వర్గాల సంక్షేమం కోసం పథకాలను చేపట్టింది. అయితే 2024 ఎన్నికల్లో పరాజయం పాలైన బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల్లో మరింత డీలా పడింది.అధికారం కోల్పోయి పూర్తి నైరాశ్యంలో ఉన్న పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ఈ సిల్వర్ జూబ్లీ వేడుకలను వినియోగించుకోవాలని నాయకత్వం భావిస్తోంది. అందులో భాగంగా పాతికేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న వేళ రజతోత్సవ వేడుకల నిర్వహణతో పాటు పార్టీ నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు భారత రాష్ట్ర సమితి సిద్ధమైంది.

కోట్ల మంది ఆవేశాన్ని దాచుకున్న ఒకే ఒక గుండె అది..! ఆటుపోట్లకు ఎదురు నిలిచిన తెగువ కేసీఆర్ సొంతం. తెలంగాణ తల్లికి రూపాన్ని.. బంగారు తెలంగాణకు స్వరూపాన్ని ఇచ్చిన ధీరోదాత్తుడు కేసీఆర్. రాష్ట్ర సాధన కోసమే ఒక రాజకీయపార్టీని స్థాపించి..పద్నాలుగేండ్లు ప్రజా ఉద్యమాన్ని ముందుండి నడిపి.. తన ప్రాణాలే పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించి.. స్వరాష్ట్రంలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన అనితర సాధ్యమైన చరిత్ర కేసీఆర్ సొంతం! ఆయన మానసపుత్రిక తెలంగాణ రాష్ట్ర సమితి..ప్రస్తుత బీఆర్ఎస్ .. 25 ఏళ్ల పండుగ జరుపుకొంటోంది. గులాబీ దళపతి కేసీఆర్ రాక కోసం..పలకరింపు కోసం..ఉత్తేజపూరిత ప్రసంగం కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది. రెండున్నర దశాబ్దాల ఘన చరిత్రను సగర్వంగా స్మరించుకుంటూ, ఈ 25 ఏళ్ల పండుగ వేళ ప్రతి కార్యకర్త గుండె నిండా గులాబీ పూస్తోంది. త్యాగాల పునాదులపై ఏర్పడ్డ బీఆర్ఎస్..బంగారు తెలంగాణ బాట నిండా గులాబీలు పరుస్తోంది. రజతోత్సవ వేదికగా.. కేసీఆర్ సారథ్యంలో మరో విజయ ప్రస్థానానికి సిద్ధమవుతోంది. జై తెలంగాణ!!

**పి.వి.రమణ గుప్త**
సీనియర్ జర్నలిస్ట్